# సాహో నితీశ్

**బాక్సింగ్ డే టెస్టులో తెలుగు కుర్రాడి వీరోచిత శతకం • అండగా నిలిచిన వాషింగ్టన్ సుందర్**

**భారత్‌కు తప్పిన ఫాలోఆన్ గండం • తొలి ఇన్నింగ్స్‌లో 358/9**

**191/6. మూడో రోజు ఆటలో భాగంగా తొలి ఇన్నింగ్స్‌లో నితీశ్‌కుమార్ రెడ్డి క్రీజులోకి వచ్చే ముందు భారత్ స్కోరిది. ఇక మిగిలింది ఇద్దరే ప్రొఫెషనల్ బ్యాటర్లు. జోరు మీదున్న ఆస్ట్రేలియా బౌలర్ల ధాటికి మరో 30, 40 పరుగులు జోడించినా ఎక్కువే అనుకున్నారంతా..! మెల్‌బోర్న్ కూడా క్రమంగా చేజారిపోతోందేమోనన్న అనుమానం! దానిని నిజం చేస్తూ కొద్ది సేపటికే జడేజా వికెట్ రూపంలో టీమ్‌ఇండియాకు మరో షాక్. కానీ ఇప్పుడిప్పుడే అంతర్జాతీయ క్రికెట్‌లో తన ముద్ర వేస్తున్న నితీశ్‌కు మరో యువ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ తోడవడంతో కథ పూర్తిగా మారింది. ఈ ఇద్దరూ ప్రఖ్యాత మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో తమ కెరీర్ ఆసాంతం గుర్తుంచుకునే చరిత్రాత్మక ఇన్నింగ్స్ ఆడారు. భీకర ఆసీస్ పేస్ దళాన్ని, దిగ్గజ స్పిన్నర్‌ను సమర్థవంతంగా ఎదుర్కొని అసాధారణ రీతిలో పోరాడారు. ఫాలోఆన్ గండాన్ని తప్పించుకుంటే గొప్ప అనుకునే స్థితి నుంచి బాక్సింగ్ డే టెస్టులో భారత్‌ను పోటీలోకి తెచ్చారు. ముఖ్యంగా 21 ఏండ్ల తెలుగు కుర్రాడు నితీశ్ వీరోచిత శతకమైతే నభూతో నభవిష్యత్..**

మెల్‌బోర్న్: తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి (176 బంతుల్లో 105 నాటౌట్, 10 ఫోర్లు, 1 సిక్స్) వీరోచిత శతకంతో బాక్సింగ్ డే టెస్టులో భారత్ ఫాలోఆన్ గండాన్ని తప్పించుకోవడమే గాక మ్యాచ్‌పై పట్టు సాధించే ఆశలనూ మెరుగుపరుచుకుంది. నితీశ్‌తో పాటు వాషింగ్టన్ సుందర్ (162 బంతుల్లో 50, 1 ఫోర్) చరిత్రాత్మక ఇన్నింగ్స్ ఆడి భారత్‌ను ఫాలోఆన్ గండం నుంచి గట్టెక్కించడమే గాక కంగారూల ఆధిక్యాన్ని గణనీయంగా తగ్గించారు. ఈ ఇద్దరి పోరాటంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్.. 116 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 358 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో రోహిత్ సేన ఇంకా 116 పరుగులు వెనుకబడి ఉంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి నితీశ్‌కు అండగా సిరాజ్ (2 నాటౌట్) క్రీజులో ఉన్నాడు.

**చరిత్రాత్మక పోరాటం**

ఆస్ట్రేలియాతో టెస్టులు అంటే ఈడెన్ గార్డెన్‌లో లక్ష్మణ్, ద్రావిడ్ రికార్డు భాగస్వామ్యం.. కంగారూల గడ్డపై సచిన్, కోహ్లీ శతక గర్జన.. గబ్బాలో రిషభ్ పంత్ మెరుపులు.. గత రెండు పర్యటనలలో పుజారా డిఫెన్స్ గుర్తొస్తాయి. వీటికేమాత్రం తీసిపోకుండా మెల్‌బోర్న్‌లో నితీశ్, సుందర్ చరిత్రాత్మక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఓవర్‌నైట్ స్కోరు 164/5తో మూడో రోజు ఆట ఆరంభించిన భారత్.. ఆరంభంలోనే రిషభ్ (28) వికెట్‌ను కోల్పోయింది. సిరీస్‌లో చెత్త ఆటతో విమర్శల పాలవుతున్న పంత్.. మళ్లీ ఓ చెత్త షాట్ ఆడి పెవిలియన్ చేరాడు. స్కోరుబోర్డుపై మరో 30 పరుగులు చేరగానే జడేజా (17) కూడా నిష్క్రమించాడు. ఈ క్రమంలో వాషింగ్టన్‌తో జతకలిసిన నితీశ్.. ఎంసీజీలో కంగారూలకు కొరకరాని కొయ్యగా మారాడు. ఆసీస్ బౌలర్లకు ఏమాత్రం అవకాశమివ్వకుండా నిలకడ ప్రదర్శించాడు. క్రీజులో నిలదొక్కుకునేదాకా షాట్ల జోలికి పోలేదు. లియాన్ బౌలింగ్‌లో లాంగాన్ మీదుగా భారీ సిక్సర్ బాదిన అతడు.. ఒక్కో పరుగును కూడగడుతూ స్కోరుబోర్డును ముందుకు నడిపించాడు. మరో ఎండ్‌లో సుందర్ అతడికి పూర్తి సహకారం అందించాడు. ఈ జోడీని విడదీసేందుకు కమిన్స్.. బౌలర్లను మార్చి మార్చి ప్రయోగించినా వారికి ఒక్క అవకాశం కూడా ఇవ్వకుండా జాగ్రత్తపడ్డారు. లంచ్ తర్వాత స్టార్క్ వేసిన ఓవర్లో మూడో బంతిని బౌండరీకి తరలించిన నితీశ్.. తన కెరీర్‌లో తొలి అర్ధ శతకాన్ని 80 బంతుల్లో పూర్తిచేశాడు. మార్ష్ బౌలింగ్‌లో రెండు బౌండరీలు బాదిన అతడు.. లియాన్ బౌలింగ్‌లో ఫోర్ కొట్టి 90ల లోకి వచ్చాడు. ఇదే ఓవర్లో సుందర్ 146 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తిచేశాడు. కానీ డ్రింక్స్ విరామం తర్వాత అతడు.. లియాన్ బౌలింగ్‌లోనే స్లిప్స్‌లో స్మిత్‌కు క్యాచ్ ఇవ్వడంతో 127 పరుగుల 8వ వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది.

**శతకం ముంగిట టెన్షన్.. టెన్షన్**

సుందర్ నిష్క్రమించే సమయానికి నితీశ్ 97 పరుగుల వద్ద ఉండగా కమిన్స్ మరుసటి ఓవర్లో బుమ్రాను ఔట్ చేశాడు. దీంతో అందర్లోనూ టెన్షన్ మొదలైంది. సిరాజ్ క్రీజులో ఉండగా నితీశ్ నాన్ స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్నాడు. కానీ సిరాజ్.. కమిన్స్ ఓవర్‌లో మూడు బంతులను కాపాడుకుని నితీశ్‌కు స్ట్రైక్ ఇచ్చాడు. బొలాండ్ వేసిన 115వ ఓవర్లో మూడో బంతిని మిడాన్ దిశగా బౌండరీ తరలించడంతో అతడి తొలి శతకం పూర్తయింది. అర్ధ శతకాన్ని పుష్ప స్టైల్ (తగ్గేదేలే)లో సెలబ్రేట్ చేసుకున్న ఈ గాజువాక కుర్రాడు.. సెంచరీని బాహుబలిలో ప్రభాస్ కత్తిమీద చేతిని పెట్టి ఠీవీగా కూర్చునే సీన్‌ను రిక్రియేట్ చేయడం అభిమానులను అలరించింది. నితీశ్ సెంచరీని ప్రత్యక్షంగా వీక్షించిన అతడి తండ్రి ముత్యాల రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు.

**సంక్షిప్త స్కోర్లు**

**ఆస్ట్రేలియా:** 474 ఆలౌట్
**భారత్:** 358/9 (నితీశ్ 105 నాటౌట్, వాషింగ్టన్ 50, బొలాండ్ 3/57, కమిన్స్ 3/86)

**1** ఆస్ట్రేలియాలో 8వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి అత్యధిక స్కోరు చేసిన బ్యాటర్ నితీశ్. గతంలో ఈ రికార్డు కుంబ్లే (87, 2008లో) పేరిట ఉంది.

**2** 8వ వికెట్‌కు ఆస్ట్రేలియాపై నితీశ్-సుందర్ నెలకొల్పిన భాగస్వామ్యం (127) రెండో అత్యుత్తమం. సచిన్-హర్భజన్ (129, 2008లో) ముందున్నారు.

**3** ఆసీస్ గడ్డపై శతకాలు చేసిన అతి పిన్న వయస్కులలో నితీశ్ మూడోవాడు. సచిన్ (18 ఏండ్ల 256 రోజులు), పంత్ (21 ఏండ్ల 92 రోజులు).. నితీశ్ (21 ఏండ్ల 216 రోజులు) కంటే ముందున్నారు.

## శభాష్ నితీశ్

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంసలు**

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): ఆస్ట్రేలియాతో మెల్‌బోర్న్ టెస్టులో సూపర్ సెంచరీతో విజృంభించిన నితీశ్‌కుమార్‌రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందిస్తూ 'ఆసీస్‌పై నితీశ్ వీరోచితమైన ఇన్నింగ్స్. నీ ప్రదర్శనకు సలామ్ యంగ్ మ్యాన్. మెల్‌బోర్న్‌లో చారిత్రక ఇన్నింగ్స్‌తో కదంతొక్కావు. నితీశ్‌లో నీలో భవిష్యత్ భారత కెప్టెన్‌ను చూస్తున్నాను. దేశానికి గర్వపడే క్రికెటర్‌ను అందించిన ముత్యాలరెడ్డితో పాటు కుటుంబసభ్యులకు అభినందనలు' అని పేర్కొన్నారు.

## 25 లక్షల నజరానా

న్యూఢిల్లీ: మెల్‌బోర్న్ టెస్టులో మెరుపులు మెరిపించిన యువ క్రికెటర్ నితీశ్‌కుమార్‌రెడ్డికి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) అదిరిపోయే నజరానా ప్రకటించింది. ఆసీస్‌పై అద్భుత ప్రదర్శన కనబరుస్తూ టెస్టుల్లో తొలి సెంచరీ ఖాతాలో వేసుకున్న నితీశ్‌కు రూ.25లక్షల నగదు ప్రోత్సాహం ప్రకటించింది. టీమ్‌ఇండియా తరపున అద్భుత ప్రదర్శన కనబరిచిన నితీశ్‌కు ఏసీఏ అధ్యక్షుడు కేసినేని శివనాథ్ అభినందనలు తెలిపారు. మరోవైపు ఆసీస్‌ను దీటుగా ఎదుర్కొంటూ నితీశ్ చారిత్రక ఇన్నింగ్స్ ఆడాడంటూ క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ప్రశంసలు కురిపించారు.

## నాన్నకు ప్రేమతో..

(నమస్తే తెలంగాణ క్రీడా విభాగం)

నితీశ్‌కుమార్‌రెడ్డి..ప్రస్తుతం సోషల్‌మీడియాలో ట్రెండ్ అవుతున్న పేరు. మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియన్లకు ముచ్చెమటలు పట్టిస్తూ తెలుగోడి పౌరుషాన్ని పరిచయం చేసిన నితీశ్ ఒంటరిపోరాటం మరువలేనిది. సుదీర్ఘ భారత క్రికెట్ చరిత్రలో మరుపురాని ఇన్నింగ్స్ ఆడిన నితీశ్ ఈ స్థాయికి చేరుకోవడం వెనుక ఓ కన్నీటి గాథ ఉంది. ఏదో ఒక రోజు దేశానికి ప్రాతినిధ్యం వహించి తన తండ్రి కలను సాకారం చేయాలన్న పట్టుదలతో పసి ప్రాయంలోనే బ్యాట్ పట్టిన ఆ కుర్రాడు అనతికాలంలోనే అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు. ఊహ తెలియని వయసులో కష్టాలు చుట్టుముట్టినా.. తన కెరీర్ కోసం తండ్రి ప్రభుత్వం ఉద్యోగం వదులుకున్నా..నితీశ్ ఎంచుకున్న లక్ష్యాన్ని ఏనాడు మరువలేదు. నమ్ముకున్న దోస్తుల చేతిలో మోసపోయిన తండ్రికి భారత్‌కు ఆడి చూపిస్తానని ఏనాడో మనసులో ఫిక్స్ అయిన ఈ విశాఖపట్నం కుర్రాడు నూనుగు మీసాల వయసులో దిగ్గజాల ప్రశంసల జల్లులో తడిసిముద్దయ్యాడు. తన కెరీర్ కోసం కుటుంబం చేసిన త్యాగాన్ని ఏనాడు మరిచిపోని నితీశ్ దినదిన ప్రవర్ధమానం అన్న తరహాలో ఎదిగిన తీరు యువ క్రికెటర్లకు స్ఫూర్తిదాయకం. నిఖార్సైన ఆల్‌రౌండర్‌కు పర్యాయపదంగా నిలుస్తూ జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు అపద్బాంధవుడిలా ఆదుకున్నాడు. ఆసీస్ బౌలింగ్ ధాటికి సగం వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో ఉన్న జట్టును ఈ తెలుగు క్రికెటర్ ఒడ్డున పడేసిన తీరు నభూతో నభవిష్యత్. ఆసీస్‌పై తన కొడుకు సెంచరీ కోసం ప్రార్థిస్తూ కనిపించిన తండ్రి ముత్యాలరెడ్డి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. దేశం గర్వపడేలా రాణించిన నితీశ్‌ను చూసి ఆయన భావోద్వేగాన్ని ఆపుకోలేకపోయారు. రెడ్డిని తప్పిస్తే జట్టు సమతూకంగా ఉంటుందన్న సంజయ్ మంజ్రేకర్ లాంటి వారికి నితీశ్ సెంచరీతో చెంప చెల్లుమనేలా సమాధానమిచ్చాడు.

## నాకెందుకు ఖేల్‌రత్న ఇవ్వరు?

- **హైకోర్టును ఆశ్రయిస్తా**
- **పారాలింపియన్ యోగేశ్ అసహనం**

ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రకటించే 'ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న' అవార్డుల వివాదం నానాటికీ ముదురుతోంది. అంతర్జాతీయ క్రీడా వేదికలపై సాధారణ క్రీడాకారులతో సమానంగా తామూ పతకాలు సాధిస్తున్నప్పటికీ అవార్డుల విషయంలో తమకు అన్యాయం జరుగుతుందని పారాలింపియన్లు గళమెత్తుతున్నారు. డబుల్ పారాలింపిక్స్ మెడలిస్ట్.. డిస్కస్ త్రోయర్ యోగేశ్ ఖతునియా శనివారం ఓ ఛానెల్‌తో మాట్లాడుతూ.. 'ఇది క్రీడా మంత్రిత్వ శాఖ పరిధికి సంబంధించిన అంశం. అవార్డుల విషయంలో వాళ్లు నన్ను ఇంతవరకూ సంప్రదించలేదు. మంచి పీఆర్‌లు కలిగినవారికే అవార్డులు వస్తున్నాయనేది బహిరంగ సత్యం. మాలాంటి క్రీడాకారులను వాళ్లు విస్మరిస్తున్నారు. దీనిపై నాకు మరో ఏడాది వేచి చూసే ఓపిక లేదు. నేను కచ్చితంగా హైకోర్టుకు వెళ్తా. ఖేల్‌రత్న రావడానికి నాకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ నాకెందుకు ఇవ్వడం లేదో రాతపూర్వకంగా తెలుసుకోవాలనుకుంటున్నా' అని అసహనం వ్యక్తం చేశాడు.

## లంక చేజేతులా..

**తొలి టీ20లో కివీస్ ఉత్కంఠ విజయం**

బే ఓవల్ (మౌంట్ మొంగనుయ్): న్యూజిలాండ్‌తో శనివారం ఉత్కంఠగా జరిగిన తొలి టీ20లో గెలవాల్సిన మ్యాచ్‌లో లంక చేయులు చేజేతులా ఓటమి పాలయ్యారు. 173 పరుగుల ఛేదనలో భాగంగా ఒక దశలో 13 ఓవర్లకు 120/0గా ఉన్న లంక.. ఆ తర్వాత అనూహ్యంగా కుప్పకూలి ఓటమిని కొని తెచ్చుకుంది. ఓపెనర్ల శతాధిక భాగస్వామ్యంతో మెరిసినా ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లంతా అలా వచ్చి ఇలా వెళ్లడంతో 20 ఓవర్లలో 164/8 వద్దే ఆగిపోయి 8 పరుగుల తేడాతో ఓడింది. ఫలితంగా పథుమ్ నిస్సంక (60 బంతుల్లో 90, 7 ఫోర్లు, 3 సిక్సర్లు), కుశాల్ మెండిస్ (36 బంతుల్లో 46, 6 ఫోర్లు, 1 సిక్స్) పోరాటం వృథా అయింది. కివీస్ పేసర్ జేకబ్ డఫ్ఫీ (3/12), మ్యాట్ హెన్రీ (2/28) లంక బ్యాటర్లను కట్టడి చేశారు. అంతకు ముందు డారిల్ మిచెల్ (62), మైఖేల్ బ్రాస్‌వెల్ (59) మెరవడంతో న్యూజిలాండ్.. నిర్ణీత ఓవర్లలో 172/8 స్కోరు సాధించింది.

## గోదారి గట్టుకు రికార్డ్ వ్యూస్

అగ్ర నటుడు వెంకటేష్ నటించిన ప్రెస్టీజియస్ కామెడీ క్రైమ్ థ్రిల్లర్ 'సంక్రాంతికి వస్తున్నాం'. ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి కథానాయికలు. అనిల్ రావిపూడి దర్శకుడు. దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ చిత్రం జనవరి 14 విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా విడుదల చేసిన రెండు పాటలు శ్రోతల్ని విశేషంగా అలరిస్తున్నాయని మేకర్స్ చెబుతున్నారు. ముఖ్యంగా భాస్కరభట్ల సాహిత్యం అందించగా, భీమ్స్ సిసిరోలియో స్వర రచనలో రమణ గోగుల, మధుప్రియ కలిసి ఆలపించిన 'గోదారి గట్టుమీద రామసిలకవే..' పాట విడుదలైన మూడు వారాల్లోనే 50 మిలియన్ వ్యూస్‌ను రీచ్ అయ్యి, సీనియర్ హీరోల సినిమాల్లో రికార్డుగా నిలిచింది. అంతేకాక సోషల్‌మీడియాలో సంచలనంగా మారింది. రీసెంట్‌గా విడుదలైన రెండో పాట 'మీనూ..' కూడా పెద్ద హిట్ సాంగ్‌గా నిలిచిందని, ఈ నెల 30న వెంకటేష్ స్వయంగా ఆలపించిన పొంగల్ స్పెషల్ సాంగ్ విడుదల కానున్నదని మేకర్స్ తెలిపారు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై ఈ సినిమా రూపొందిన విషయం తెలిసిందే.

## కన్నడస్టార్ గణేశ్‌తో పీపుల్ మీడియా

ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ కన్నడ రంగంలోకి అడుగుపెడుతున్న విషయం తెలిసిందే. కన్నడ స్టార్ హీరో గణేష్‌తో వారు ఓ చిత్రాన్ని నిర్మించనున్నారు. ప్రముఖ కొరియోగ్రాఫర్ బి.ధనంజయ్ ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఈ విషయాన్ని శనివారం ఓ ప్రకటన ద్వారా పీపుల్‌మీడియా సంస్థ తెలియజేసింది. తమ సంస్థ నుంచి వస్తున్న 49వ సినిమా ఇదని, కన్నడ సినిమా సామర్థ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసేలా ఈ సినిమా ఉంటుందని పీపుల్ మీడియా అధినేత టీజీ విశ్వప్రసాద్ తెలిపారు. ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు త్వరలో తెలియజేస్తామని వారు చెప్పారు.

## పీరియాడిక్ కథలో..

అగ్ర నటుడు చిరంజీవి ప్రస్తుతం 'విశ్వంభర' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. వశిష్ఠ దర్శకత్వంలో సోషియో ఫాంటసీ ఇతివృత్తంతో తెరకెక్కుతున్న ఈ సినిమా మే నెలలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఇదిలావుండగా 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో చిరంజీవి ఓ సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే. ఇటీవలే అధికారిక ప్రకటన వెలువడింది. ఫస్ట్‌లుక్ పోస్టర్ సైతం అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. హీరో నాని సమర్పకుడిగా వ్యవహరిస్తున్న ఈ చిత్రాన్ని నిర్మాత సుధాకర్ చెరుకూరి నిర్మిస్తారు. పవర్‌పుల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కనున్న ఈ సినిమా కథాంశం గురించి ఆసక్తికరమైన వార్తలొస్తున్నాయి. ఈ చిత్రాన్ని పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందించబోతున్నారని, చిరంజీవి పాత్ర శక్తివంతంగా ఉంటుందని చెబుతున్నారు. ఈ సినిమా కోసం చిరంజీవి సరికొత్త మేకోవర్‌కు సిద్ధమవుతున్నారని సమాచారం. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా 'విశ్వంభర' విడుదల అనంతరం సెట్స్‌మీదకు వెళ్లనుందని సమాచారం. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడికానున్నాయి.

## కనీవినీ ఎరుగని సరికొత్త ప్రపంచం

రాజమౌళి, మహేశ్‌బాబు సినిమా అప్‌డేట్ అంటూ కొందరు నెటిజన్లు తోచినట్టు రాసేస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఫిబ్రవరిలో మొదలుకానున్నదంటూ ఓ వార్త సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో చక్కర్లు కొట్టింది. అయితే.. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా షూటింగ్ ఏప్రిల్ నుంచి మొదలు కానున్నదట. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో విడుదల కానుంది. భారతీయ చిత్ర పరిశ్రమలో కనీవినీ ఎరుగని సరికొత్త ప్రపంచాన్ని రాజమౌళి ఆవిష్కరించనున్నట్టు ఈ చిత్ర రచయిత విజయేంద్రప్రసాద్ ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ సినిమాలో భారతీయ నటులతో పాటు విదేశీ నటులు కూడా భాగం కానున్నారు. హాలీవుడ్ టెక్నీషియన్స్ పనిచేయనున్నారు. దాదాపుగా వెయ్యికోట్ల భారీ బడ్జెట్‌తో దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్.నారాయణ నిర్మించనున్న ఈ చిత్రాన్ని భారతీయ భాషలతోపాటు విదేశీ భాషల్లో కూడా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇదిలావుంటే.. ఈ సినిమాలో ఇండోనేషియా నటి చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ కథానాయికగా నటిస్తున్నట్టు గతంలో వార్తలొచ్చాయి. తాజాగా మరో నటి పేరు తెరపైకి వచ్చింది. ఆమె ఎవరో కాదు, బాలీవుడ్ భామ ప్రియాంక చోప్రా. దర్శకుడు రాజమౌళి ఆమెతో చర్చలు కూడా జరిపినట్టు సమాచారం. ఈ కథలో హీరోయిన్ పాత్రకు అధిక ప్రాధాన్యత ఉంటుందని, ప్రియాంక అయితే ఆ పాత్రకు న్యాయం చేయగలదని రాజమౌళి భావించినట్టు తెలుస్తున్నది. ప్రియాంక కూడా ఈ ప్రెస్టీజియస్ ప్రాజెక్టులో నటించేందుకు ఉత్సాహం చూపిస్తున్నట్టు బీటౌన్ టాక్. ఈ పాత్ర కోసం ఆమె ప్రిపరేషన్ కూడా మొదలుపెట్టిందట.

## కృతి కాదు కీర్తి!

ముంబయి మీడియా ఫొటోగ్రాఫర్ల అనుచిత వ్యాఖ్యలు కథానాయిక కీర్తి సురేష్‌కు కాస్త అగ్రహం తెప్పించాయి. అయినా భావోద్వేగాలను నియంత్రించుకొని ఆమె వ్యవహరించింది. ఈ నేపథ్యంలో దక్షిణాది నాయికలపై అక్కడి మీడియా వివక్షాపూరిత వైఖరి పట్ల విమర్శలొస్తున్నాయి. ఈ వివాదం వివరాల్లోకి వెళితే.. హిందీ చిత్ర సీమలో అరంగేట్రం చేస్తూ కీర్తి సురేష్ నటించిన 'బేబీ జాన్' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా ముంబయిలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరై బయటికొస్తున్న కీర్తి సురేష్‌కు మీడియా ఫొటోగ్రాఫర్లు ఎదురుపడ్డారు. ఫొటోలు తీస్తున్న సమయంలో కొందరు ఆమెను 'కృతి' అనే పేరుతో పదే పదే పిలిచారు. దీంతో ఆసహనానికిలోనైన కీర్తి సురేష్.. తన పేరు కీర్తి అని వారికి గుర్తు చేసింది. ఇంతలోనే కొందరు ఫొటోగ్రాఫర్స్ కీర్తి దోశ అంటూ పిలిచారు. ఆ పిలుపుతో ఇబ్బందికి గురైంది కీర్తి సురేష్. అయినా తన కోపాన్ని అణచుకొంటూ 'నా పేరు కీర్తి సురేష్. కీర్తి దోశ కాదు..దోశ నాకు చాలా ఇష్టం' అంటూ నవ్వుతూ సమాధానమిచ్చింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. దక్షిణాది నాయికలను అవహేళన చేసే విధంగా 'దోశ' అని పిలవడం పట్ల పలువురు సినీ తారలు అభ్యంతరం వ్యక్తం చేశారు.

## వినోదంతో కూడిన సందేశం

ధర్మ, ఐశ్వర్యశర్మ జంటగా నటించిన చిత్రం 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' అనేది ఉపశీర్షిక. వాస్తవ సంఘటనల ఆధారంగా దర్శకుడు కిరణ్ తిరుమల శెట్టి తెరకెక్కించిన ఈ చిత్రానికి బసవ రాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మాతలు. ఈ నెల 27న సినిమా విడుదలైంది. ఈ సందర్భంగా సినిమా సక్సెస్‌మీట్‌ను శనివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. 'వ్యక్తిగా బాధ్యతాయుతమైన ప్రయాణాన్ని సాగిస్తున్న నేను 'డ్రింకర్ సాయి' అనే పేరుతో సినిమా చేశాను అనగానే కొందరు మిత్రులు సందేహాలు వెలిబుచ్చారు. ఈ కథలో అద్భుతమైన సందేశం ఉంది కాబట్టే ఈ సినిమా తీశానని వారికి తర్వాత తెలిసింది. ఈ సినిమా వసూళ్ల పరంగా లాభాల బాటలో పయనిస్తున్నది. దర్శకుడు కిరణ్, హీరో ధర్మ, హీరోయిన్ ఐశ్వర్య.. ఇలా అందరూ ప్రాణం పెట్టి పనిచేశారు. టెక్నీషియన్లంతా ప్యాషనేట్‌గా వర్క్ చేశారు. వీరందరి వల్లే ఈ విజయం.' అని నిర్మాతల్లో ఒకరైన బసవరాజు శ్రీనివాస్ తెలిపారు. 'కొన్ని తప్పుల గురించి ఆలస్యంగా తెలుసుకుంటాం. అలర్ట్ అయ్యేలోపు జరగాల్సిన డ్యామేజీ జరిగిపోతుంది. ఇందులో హీరో అలాగే ఓ తప్పు చేస్తాడు. తర్వాత దాన్ని దిద్దుకోలేక బాధపడతాడు. ఇలా ఎవరి జీవితంలో జరగకూడదని తెలిపే ఓ మంచి సందేశమే ఈ సినిమా. ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని దర్శకుడు చెప్పారు. ఇంకా నిర్మాతలు బసవరాజు లహరిధర్, ఇస్మాయిల్ షేక్ మాట్లాడారు.

## ముద్దుపేరు స్వాతిరెడ్డి.. భగ్గుమంది ఎండుగడ్డి

2023లో 'మ్యాడ్' సినిమా చేసిన హంగామా అంతాఇంతా కాదు. ఆ సినిమా సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్' రానున్నదని తెలియగానే.. ఆడియన్స్‌లో అంచనాలు అమాంతం పెరిగిపోయాయి. కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో హారిక సూర్యదేవర, సాయిసౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రంలో సంగీత్ శోభన్, నార్నె నితిన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న విషయం తెలిసిందే. ప్రమోషన్‌లో భాగంగా 'లడ్డుగాని పెళ్లి..' అంటూ ఈ సినిమా నుంచి విడుదలైన తొలి గీతానికి విశేషమైన స్పందన లభించిందని మేకర్స్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే శనివారం ఈ సినిమా నుంచి రెండో గీతాన్ని విడుదల చేశారు. 'నా ముద్దు పేరు పెట్టుకున్న స్వాతిరెడ్డి.. నే ముట్టుకుంటే భగ్గుమంది పచ్చ ఎండుగడ్డి..' అంటూ సురేష్ గంగుల రాసిన ఈ పాటను భీమ్స్ సిసిరోలియో స్వరపరచి, స్వయంగా ఆలపించారు. ఈ పాట యువతను ఉర్రూతలూగించడం ఖాయమని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. ఈ పాటలో హీరోలు సంగీత్ శోభన్, నార్నె నితిన్, రామ్ నితిన్‌లతో పాటు రెబా మౌనికా కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలచిందని వారు తెలిపారు. ఈ చిత్రానికి సమర్పణ: సూర్యదేవర నాగవంశీ.

## హృద్యమైన ప్రేమకథ

గత ఏడాది తమిళంలో విడుదలైన 'డా..డా' చిత్రం మంచి విజయం సాధించింది. కవిన్, అపర్ణదాస్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమాను జేకే ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నిర్మాత నీరజ కోట తెలుగులో 'పా..పా' పేరుతో విడుదల చేయబోతున్నారు. జనవరి 3న ప్రేక్షకుల ముందుకురానుంది. 'తండ్రీకొడుకుల సెంటిమెంట్‌తో ఈ సినిమాను తెరకెక్కించారు. హృదయాన్ని స్పృశించే భావోద్వేగాలుంటాయి. కథానుగుణంగా చక్కటి పాటలు కుదిరాయి. లవ్, ఎమోషన్స్, కామెడీ ప్రధానంగా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది' అని నిర్మాత తెలిపారు. భాగ్యరాజా, వీటీవీ గణేష్, ఐశ్వర్య, ప్రదీప్‌శక్తి తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: జెన్ మార్టిన్, దర్శకత్వం: గణేష్ కె బాబు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.